బాధితులకు భరోసా

మేమున్నాం.. ధైర్యంగా ఉండండి

మెడికవర్ ఆస్పత్రిలో క్షతగాత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరామర్శ

- కేజీహెచ్‌లో మృతుల కుటుంబాలకు ఓదార్పు
- ఎసెన్షియా కంపెనీలో పర్యటించి ఘటనపై అధికారులతో సమీక్ష
- యాజమాన్యం తీరుపై ఆగ్రహం
- రెండు జిల్లాల్లో సుడిగాలి పర్యటన



క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



మెడికవర్ ఆస్పత్రిలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సీఎం

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):

విపత్తు జరిగినప్పుడు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుంటారని మరోసారి రుజువు చేశారు. అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా కంపెనీలో భారీ ప్రమాదం సంభవించిన తరువాత అమరావతి నుంచి ఎప్పటికప్పుడు సమీక్షించిన చంద్రబాబు గురువారం ఉదయం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించారు. సంఘటనా స్థలం సందర్శన కంటే తొలుత బాధితులను పరామర్శించి వారిని ఓదార్చాలని భావించి ఉదయం నుంచి సాయంత్రం వరకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో సుడిగాలి పర్యటన చేశారు.

గురువారం ఉదయం విజయవాడ నుంచి విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్‌కు వచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన విశాఖ వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మెడికవర్‌లో ఏడుగురు క్షతగాత్రులను వారు చికిత్స తీసుకుంటున్న బెడ్‌ల వద్దకు వెళ్లి జరిగిన ఘటన వివరాలు తెలుసుకున్నారు. పూర్తిగా నయం అయ్యేవరకు ఆస్పత్రిలో చికిత్స అందిస్తామని, అందుకు ఖర్చు విషయంలో వెనుకాడేదిలేదని చెబుతూ పక్కనే ఉన్న వైద్యులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అక్కడ నుంచి కోస్టల్ బ్యాటరీకి వెళ్లి హెలికాప్టర్‌లో అచ్యుతాపురం వెళ్లాలని షెడ్యూల్‌లో ఉంది. అయితే మెడికవర్ నుంచి కేజీహెచ్‌కు వెళ్లి మృతుల బంధువులతో మాట్లాడాలని నిర్ణయించి కలెక్టర్‌కు అదే విషయం తెలిపారు. దీంతో సీఎం కేజీహెచ్‌కి రోడ్డుమార్గాన బయలుదేరి వెళ్లారు. బుధవారం ఎసెన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి భౌతికకాయాలకు పోస్టుమార్టం నిర్వహించే మార్చురీ వద్దకు వెళ్లి మృతుల కుటుంబాలను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని చెప్పి మృతుల కుటుంబాలకు రూ.కోటి వంతున పరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. ఇంకా ప్రభుత్వ పరంగా సహాయం విషయంపై కూడా ఆలోచన చేస్తున్నామని వారికి చెప్పి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కోటవురట్ల మండలం కైలాసపట్నం అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను చంద్రబాబు పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అక్కడ నుంచి తిరిగి కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదం జరిగిన కర్మాగారాన్ని సందర్శించారు. తరువాత అదే ప్రాంతంలో ఉన్న లారస్ ల్యాబ్‌లో సెమినార్ హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కర్మాగార యాజమాన్యం తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణంగా పారిశ్రామికవేత్తలతో స్నేహపూర్వకంగా ఉంటూ మరిన్ని పెట్టుబడుల కోసం ప్రయత్నించే చంద్రబాబు ఎసెన్షియా కంపెనీ యాజమానుల మధ్య వివాదాన్ని ప్రస్తావించారు. అచ్యుతాపురం సెజ్‌లో అత్యంత తీవ్రమైన ప్రమాదం జరిగి 17 మంది చనిపోయి, 62 మంది గాయపడితే కర్మాగారం పెట్టిన ప్రమోటర్ ఘటనాస్థలానికి రావడం ప్రాథమిక బాధ్యత అని సీఎం ఒకింత తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పరిశ్రమలు రావాలని కోరుకునే వ్యక్తిని... ఇంకా పారిశ్రామికవేత్తలను గౌరవిస్తాం... అని చెప్పారు. తరువాత అక్కడ నుంచి తిరిగి హెలికాప్టర్‌లో విశాఖ విమానాశ్రయానికి చేరుకుని గన్నవరం బయలుదేరి వెళ్లారు.



కేజీహెచ్‌లో మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

తడి ఆరని కన్నులు

- ప్రమాద మృతుల కుటుంబాల్లో ఒకొక్కరిదీ ఒక్కో వ్యథ
- ఒక్క జీతమూ తీసుకోలేదంటూ ఓ తల్లి ఆవేదన
- ప్రేమించి పెళ్లి చేసుకున్న నాలుగు నెలలకే భర్తను కోల్పోయిన యువతి
- ఇంటి నిర్మాణం ప్రారంభించిన మూడు నెలలకే అశువులు బాసిన కుమారుడు
- అత్యవసరంగా రావాలంటూ ఫోన్ చేయడంతో విధుల్లోకి వెళ్లి ప్రాణాలు కోల్పోయిన మరో యువకుడు

- వివరాలు మెయిన్ 11లో



కేజీహెచ్ మార్చురీ వద్ద రోదిస్తున్న మృతుని కుటుంబీకులు

రెండేళ్ల క్రితమే హెచ్చరించినా!

పట్టించుకోని ఎసెన్షియా కర్మాగార యాజమాన్యం

- భారీ ప్రమాదం జరిగినా జాడలేని యజమానులు



ప్రమాదం జరిగిన ఎసెన్షియా కంపెనీని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కర్మాగార యాజమాన్యం నిర్లక్ష్యమే కొంపముంచింది. కర్మాగారంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన భారీ ప్రమాదంలో ఏకంగా 17 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కర్మాగారంలో పైపులు ఎప్పటికప్పుడు పరిక్షించి లీకులు అరికట్టాలని రెండేళ్ల క్రితం అధికారులు హెచ్చరించారు. అంతేకాకుండా కర్మాగారంలో అనేక లోపాలను గుర్తించిన అధికారులు తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని చెప్పిన ఆదేశాలు పాటించి ఉంటే బుధవారం ఘోర ప్రమాదం జరిగి ఉండేదికాదని పరిశ్రమల నిపుణులు గుర్తుచేస్తున్నారు.

రెడ్ కేటగిరీలో ఉన్న ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను 2022లో భద్రతా ఆడిట్ జరిగినపుడు పలు లోపాలు గుర్తించారు. తక్షణమే లోపాలు సవరించడంతోపాటు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని కర్మాగార విభాగం సంబంధిత యాజమాన్యానికి ఆదేశించింది. కర్మాగారంలో పలు విభాగాలలో సుమారు 100 అంశాలను ప్రస్తావించి దీని ప్రకారం నివారణ చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ అంశాలలో రెండు, మూడు అంశాలు కేవలం పైపులు లీకులకు సంబంధించివే. పీరియాడికల్‌గా పైపులు తనిఖీచేసి లీకులు ఉంటే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని స్పష్టంచేసింది. ఘోరమైన విషయం ఏమిటంటే... రియాక్టర్ నుంచి సాల్వెంట్‌ను పంపుతున్న పైపులు లీకై కింద ఫ్లోర్‌లోని ఎలక్ట్రికల్ ప్యానళ్లపై పడి ఆవిరిమేఘంగా మారి బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఒత్తిడికి గురికావడం, అదే సమయంలో స్పార్క్ వచ్చి పెద్ద పేలుడు సంభవించింది. చివరకు భారీ పేలుడుకు 17మంది చనిపోయారు. పైపుల లీకులు, పీరియాడికల్‌గా తనిఖీలు చేసి ఉంటే ప్రాణాలు కాపాడే అవకాశం ఉండేదని కొందరు అధికారులు గుర్తుచేస్తున్నారు. ఇదిలావుండగా కర్మాగారంలో భారీ ప్రమాదం జరిగినా కంపెనీ యాజమాన్యం జాడ లేకపోవం గమనార్హం. మృతుల కుటుంబాలు, గాయపడిన వారికి పరిహారం కోసం సొమ్మును కంపెనీ ప్రతినిధి ఒకరు జిల్లా యంత్రాంగానికి అందజేశారు తప్ప యజమానులు రాలేదు.

కంపెనీ అమ్మకాల్లో సంస్థ వ్యవస్థాపక యజమాని పెంద్రి కిరణ్ రెడ్డికి తరువాత వాటాలు కొనుగోలుచేసిన దక్కన్ కెమికల్స్ యజమాన్యానికి గొడవలున్నాయి. ముఖ్యమంత్రి స్వయంగా సమీక్ష చేసి, కర్మాగారం తనిఖీచేసినా ఇద్దరు యజమానులు రాలేదు. ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. యజమానులకు కోట్ల లాభాలు తెచ్చిపెట్టిన ఉద్యోగులు, నిపుణుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి తప్ప యజమానులు మారలేదని ప్రమాదంలో మృతి చెందిన ఒకరి బంధువు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నైపుణ్యంతో పని లేదా?

- తక్కువ జీతానికి అనుభవం లేనివారితో పనులు
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కాంట్రాక్ట్ కార్మికులు నిద్ర లేకుండా విధులు
- విశ్రాంతి లేకపోవడంతో ప్రమాదాలు



ఎసెన్షియా కంపెనీ గేటు వద్ద గుమిగూడిన జనం

అచ్యుతాపురం, ఆగస్టు 22: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యం తక్కువ జీతానికి వస్తున్నారనే ఉద్దేశంతో నైపుణ్యం, అనుభవం లేని వారితో పనులు చేయిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక నిపుణుడి వద్ద పనిచేసిన పలువురిని తక్కువ జీతానికి తీసుకుని యంత్రాల వద్ద పనులు ... మిగతా 6వ పేజీలో

ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ వేగవంతం

- వేలం హాళ్లు, ప్యాకింగ్ యూనిట్, రెస్ట్ రూమ్, చేపలు ఎండబెట్టుకోవడానికి పరిశుభ్రమైన యార్డులు, చేపలు నిల్వ చేసుకునే సదుపాయం, ఫ్లోటింగ్ జెట్టీల ఏర్పాటు
- మరో రూ.26.7 కోట్లు కేటాయించిన పోర్టు
- అదనంగా రెండు ఫింగర్ జెట్టీలు నిర్మాణం



ఫిషింగ్ హార్బర్‌లో నిర్మాణాలు


(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్నాయి. ఇందుకోసం రూ.151.81 కోట్లు వెచ్చించేందుకు విశాఖపట్నం పోర్టు ముందుకు వచ్చింది. అందులో రూ.50 కోట్లు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మంజూరుచేశారు. మరో రూ.50 కోట్లు సాగరమాల కింద కేంద్ర నౌకాయానశాఖ ఇచ్చింది. పీపీపీ ప్రాజెక్టుల ద్వారా రూ.27.55 కోట్లు సమకూర్చుకోనున్నారు. విశాఖపట్నం పోర్టు తొలుత రూ.24.26 కోట్లు ఇస్తామని ప్రకటించింది. అయితే మత్స్యకారులు వసతులు పెంచాలని, ఫింగర్ జెట్టీలు కావాలని, వలలు అల్లుకోవడానికి భవనం నిర్మించాలని డిమాండ్ చేయడంతో మరో రూ.26.7 కోట్లు సమకూర్చడానికి విశాఖపట్నం ... మిగతా 6వ పేజీలో

ప్లేట్‌లెట్స్ డౌన్!

జ్వర బాధితుల్లో ఎదురవుతున్న సమస్య

- వైరల్ హెమరాజిక్ ఫీవర్స్‌తో ఇబ్బందులు
- ప్రతి నలుగురిలో ఇద్దరికి తగ్గుతున్న ప్లేట్‌లెట్స్
- భయపడవద్దంటున్న వైద్యులు



విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):

జ్వర బాధితుల్లో ప్లేట్‌లెట్స్ తగ్గుముఖం పడుతున్నాయి. సాధారణంగా డెంగ్యూ జ్వరం వస్తే ప్లేట్‌లెట్స్ తగ్గుతుంటాయి. కానీ ఫ్లూ జ్వరంతో బాధపడే వారికీ ప్లేట్‌లెట్స్ తగ్గుతుండడంతో రోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ తరహా కేసులు అధికంగా నమోదవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గినప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు.

సాధారణంగా ప్లేట్‌లెట్ కౌంట్ 1.5 లక్షల నుంచి 4 లక్షలు వరకు ఉండాలి. ప్రస్తుతం కనిపిస్తున్న వైరల్ హెమరేజిక్ ఫీవర్స్ బాధితుల్లో రెండు,మూడు రోజుల్లో ఒక్కసారిగా ప్లేట్‌లెట్స్ 60 వేల నుంచి లక్ష వరకు పడిపోతున్నాయి. తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇవి డెంగ్యూ తరహా లక్షణాలుగా కనిపిస్తున్నప్పటికీ పరీక్షలు నిర్వహిస్తే నెగిటివ్ వస్తోందని వైద్యులు చెబుతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గుముఖం పడుతుండడంతో డెంగ్యూగా భావించి వైద్యం అందిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతున్నారు. వాడకూడని మందులు వాడినా ప్లేట్‌లెట్స్ తగ్గుతాయని, ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు అవసరమని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోమయాజులు తెలిపారు.

విజృంభిస్తున్న వైరల్ ఫీవర్స్

జిల్లాలో వైరల్ ఫీవర్స్ విజృంభిస్తున్నాయి. బాధితుల్లో జ్వరం, జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి, ఒళ్లు నొప్పులు కనిపిస్తున్నాయి. మూడు రోజుల తరువాత జ్వరం తగ్గినప్పటికీ ఒళ్లు నొప్పులు, తలనొప్పి వేధిస్తున్నాయి. కుటుంబంలో ఒకరికి వస్తే.. మిగిలిన వారికీ వ్యాప్తి చెందుతోందని, 70 శాతం కేసుల్లో మందులు వాడకుండానే తగ్గుతోందని వైద్యులు చెబుతున్నారు. పది నుంచి ... మిగతా 6వ పేజీలో

నేడు జగన్ అనకాపల్లి రాక



కొత్తూరు, ఆగస్టు 22 : అచ్యుతాపురం సెజ్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం అనకాపల్లి రానున్నారు. ఆయన ఉదయం గన్నవరం నుంచి విమానంలో 10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 10.20 గంటలకు బయలుదేరి రోడ్డు మార్గంలో అనకాపల్లిలోని ఉషాప్రైమ్ ఆస్పత్రికి 11.20కి చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 12.20 వరకు క్షతగాత్రులను పరామర్శించి తిరిగి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు.మధ్యాహ్నం 1.30గంటలకు విమానంలో బెంగళూరు వెళతారు.

టార్గెట్ కేజీహెచ్, విమ్స్!

ఉన్నత పోస్టుల కోసం పలువురి ప్రయత్నాలు

- కేజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టుకు ముగ్గురి మధ్య పోటీ
- విమ్స్ డైరెక్టర్ పోస్టును ఆశిస్తున్న మరో ముగ్గురు
- సిఫారసు లేఖతో విజయవాడ చుట్టూ తిరుగుతున్న ఓ వైద్యుడు
- అతని వ్యవహారశైలి ఆది నుంచీ వివాదాస్పదమే





విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పాలన పరంగా అనేక కీలక స్థానాల్లో మార్పులు జరిగాయి. ఈ క్రమంలో ఆరోగ్యశాఖలోనూ మార్పులుండే అవకాశం ఉంద న్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో నగర పరిధిలోని కీలక ఆస్పత్రులైన కేజీహెచ్, విమ్స్ ఉన్నతాధికారి పోస్టుల కోసం పలువురు వైద్యులు పోటీ పడుతున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా ప్రస్తుతం డాక్టర్ శివానంద (ఎఫ్ఏసీ), విమ్స్ డైరెక్టర్‌గా డాక్టర్ కె.రాంబాబు కొనసాగుతున్నారు. ఈ రెండుస్థానాలకు ... మిగతా 6వ పేజీలో

ప్లాంట్ పరిరక్షణే ధ్యేయం

- అడ్మిన్ కార్యాలయం ఎదుట ఉక్కు పోరాట కమిటీ మహా ధర్నా

- వివరాలు 7లో




స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

జీవీఎంసీ కార్యదర్శికి బదిలీ

విశాఖపట్నం : జీవీఎంసీ కార్యదర్శి నల్లనయ్యను విజయనగరం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు.









విశాఖలో ఒబెరాయ్ ఫైవ్ స్టార్ హోటల్

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్

సీతంపేట, ఆగస్టు 22: విశాఖపట్నంలో ఒబెరాయ్ యాజమాన్యం ఫైవ్ స్టార్ హోటల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ మేరకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. గురువారం సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన నగర పార్టీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రిని జనసేన పార్టీ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఇక్కడ ఉన్న ప్రసిద్ధి పుణ్యక్షేత్రాలు, సముద్ర తీరప్రాంత అందాలు, అరకులోయ, లంబసింగి వంటి ప్రాంతాలన్నింటిని కలుపుతూ ఒక టూరిజం సర్క్యూట్‌ను తయారు చేస్తామన్నారు. ఒక పర్యాటకుడు విశాఖపట్నానికి సందర్శనకు వస్తే రెండు, మూడు రోజులు ఉండే విధంగా ప్రణాళికను తయారు చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తామన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి టూరిజం అభివృద్ధిపై చాలా శ్రద్ధ కనబరుస్తున్నారని మంత్రి దుర్గేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా తయారు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. జనసేన కార్యకర్తలు, అభిమానులను కలిసి పార్టీని మరింత ముందుకు తీసుకొని వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సిరిపురం : ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలని మంత్రి కందుల దుర్గేష్‌ను ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ, ఈవెంట్ మేనేజర్ల అసోసియేషన్ సంయుక్తగా కోరారు. గురువారం వారు బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు.రాష్ట్రంలో ప్రతిబావంతమైన ఈవెంట్ మేనేజర్లు ఉన్నారని, ఏటా కోట్లాది రూపాయల టర్నోవర్ బిజినెస్ చేస్తున్నారని వివరించారు. అనుమతులు త్వరితగతిన ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

టార్గెట్ కేజీహెచ్, విమ్స్!

... 5వ పేజీ తరువాయి

పలువురు వైద్యులు తీవ్రస్థాయిలో ప్రయత్నాలను సాగిస్తున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ అశోక్‌కుమార్ కొద్దిరోజుల కిందట సెలవుపై వెళ్లారు. దీని వెనుక పలు కారణాలున్నాయి. ఆయన సెలవు ముగియడంతో మళ్లీ వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇదే స్థానాన్ని మరో ముగ్గురు వైద్యులు ఆశిస్తున్నారు. వీరిలో శ్రీకాకుళంలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ అల్లు పద్మజ, ఆంధ్ర మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్మథరావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరూ తమకు తెలిసిన ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలు, ఒక మంత్రి ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు చెబుతున్నారు. అలాగే, ప్రస్తుతం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద కూడా పూర్తిస్థాయి బాధ్యతలను దక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. తాను వచ్చిన తరువాత ఆస్పత్రిలో వైద్యసేవలు మెరుగ్గా అందేలా చేయడంతోపాటు సిబ్బంది క్రమశిక్షణతో మెలిగేలా చూశానని, తన పనితీరును పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరుతున్నారు. ఇందుకు అధికార పార్టీకి చెందిన సీనియర్ నేతను ఆయన సంప్రదిస్తున్నట్టు చెబుతున్నారు. విమ్స్ డైరెక్టర్ పోస్టును పలువురు ఆశిస్తున్నారు. వీరిలో రాజమండ్రి మెడికల్ కళాశాలలో న్యూరో సర్జరీ విభాగంలో పనిచేస్తున్న ఒక ప్రొఫెసర్, గతంలో కేజీహెచ్‌లోనే పని చేసి కాకినాడ బదిలీపై వెళ్లిన మరో న్యూరో సర్జరీ ప్రొఫెసర్, కేజీహెచ్ ఆర్థో విభాగానికి చెందిన ఇంకో ప్రొఫెసర్ ప్రయత్నిస్తున్నట్టు చెబుతున్నారు.

వివాదాస్పద వైద్యుడి యత్నాలు

గతంలో విమ్స్‌లో డిప్యూటేషన్‌పై పనిచేసి రోగులు నుంచి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలతో వెనక్కి వెళ్లిన వైద్యుడే ప్రస్తుతం విమ్స్ డైరెక్టర్‌గా వచ్చేందుకు పావులు ప్రయత్నాలు సాగిస్తుండడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. గతంలో విమ్స్ డైరెక్టర్‌కు చెందిన రోగి నుంచే ఆయన డబ్బులు వసూలు చేసిన వ్యవహారం అప్పట్లో సంచలనమయింది. ఇప్పటికే ఒక సీనియర్ మంత్రి నుంచి సిఫారసు లేఖ ఆయన విజయవాడలోని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చుట్టూ తిరుగుతున్నట్టు తెలిసింది. ఈ వైద్యుడి గురించి విచారించిన ఉన్నతాధికారులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నట్టు చెబుతున్నారు. రోగులతో ఆయన వ్యవహరించే తీరు, ఆస్పత్రిలో సరిగా విధులు నిర్వర్తించకపోవడం వంటి వ్యవహారాలన్నీ వారి విచారణలో తేలినట్టు తెలుస్తోంది. అటువంటి అధికారికి పదవి ఇస్తే ప్రభుత్వ ప్రతిష్ట మంట గలుస్తుందన్న భావనను వ్యక్తం చేస్తున్నారు. ఆ వైద్యుడు మాత్రం తనకు కొద్దిరోజుల్లోనే ఉన్నతస్థాయి పదవి వస్తుందని, చెప్పుకోవడం గమనార్హం. ఇదిలా ఉండగా, ఈ వైద్యుడిపై డీఎంఏకు అందిన ఫిర్యాదు మేరకు నాలుగు రోజుల కిందట విచారణ కమిటీని నియమించారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. ఈ సందర్భంలో సదరు వైద్యుడు విమ్స్ డైరెక్టర్ పోస్టు కోసం పైరవీలు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ప్లేట్‌లెట్స్ డౌన్!

... 5వ పేజీ తరువాయి

20 శాతం కేసులకు మాత్రమే మందులు వాడాల్సి వస్తోందని, పది శాతం కేసుల్లో మాత్రమే రక్త పరీక్షలకు వెళ్లాల్సి వస్తోందని డాక్టర్ సోమయాజులు తెలిపారు. అతి తక్కువ కేసులను మాత్రమే ఆస్పత్రిలో అడ్మిట్ చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోందన్నారు.

ప్లేట్‌లెట్స్ కోసం రోగులు

కాగా జిల్లాలో డెంగ్యూ కేసులు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఈ బాధితుల్లో ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోవడంతో వారి బంధువులు బ్లడ్ బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నాయి. నగర పరిధిలో 35 బ్లడ్ బ్యాంకులుండగా, ఒక్కో చోట రోజుకు కనీసం ఐదు నుంచి పది ప్లేట్‌లెట్స్ బ్యాగులను అందిస్తున్నారు. వారం రోజులుగా ప్లేట్‌లెట్స్ కోసం వస్తున్న వారి సంఖ్య పెరిగిందని వందేభారత్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్‌బాబు తెలిపారు. రోగుల అవసరాలకు అనుగుణంగా ప్లేట్‌లెట్స్ ఏర్పాటుచేయడంపై దృష్టి సారించామని వివరించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో 4,218 మందికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా, 329 మందికి పాజిటివ్‌గా తేలింది. రానున్న రోజుల్లో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆరోగ్యశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో వైరల్ ఫీవర్స్ ఎక్కువగా ఉన్నాయని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. క్షేత్రస్థాయిలో జ్వర పీడితులను పర్యవేక్షించేలా సిబ్బందికి ఆదేశాలిచ్చామని, మూడు రోజులకు మించి జ్వర లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 22 : జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న వార్షిక లీగ్ టోర్నీలో భాగంగా వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో చాంపియన్స్ సీసీ 132 పరుగుల భారీ తేడాతో ఎన్‌ఏడీ సీసీపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన చాంపియన్స్ సీసీ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 340 పరుగులు చేసింది. ఓపెనర్ హరికిరణ్ సెంచరీ (107), ఏఎస్.కిరణ్ హాఫ్ సెంచరీ (64) సాధించగా రాకేష్ (46), త్రినాథ్ (35) రాణించారు. ఎన్‌ఏడీ బౌలర్లలో జస్వీర్ సింగ్, చందు చెరో మూడు వికెట్లు తీశారు. లక్ష్య ఛేదనలో ఎన్‌ఏడీ సీసీ 34.3 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. గోపీనాథ్ (51), వినయ్ (58) అర్ధ సెంచరీలు చేయగా చందు (32) రాణించాడు. చాంపియన్స్ సీసీ బౌలర్ శివరామారావు ఐదు వికెట్లు పడగొట్టి ఎన్‌ఏడీ బ్యాట్స్‌మెన్‌ను పెవిలియన్ దారి పట్టించగా హరికిరణ్, సాయి శ్రీహర్ష చెరో రెండు వికెట్లు తీసి సహకరించారు.

సాధనతోనే విజయం సాధ్యం : విద్యా శాఖ ఆర్‌జేడీ



సమావేశంలో మాట్లాడుతున్న విద్యా శాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్

సీతంపేట, ఆగస్టు 22 : స్థిర లక్ష్యం, సాధన ద్వారా విజయం సాధించవచ్చునని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. గురువారం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డీఎస్ వర్మ గ్రంథాలయంలో అన్ని విభాగాలను చూపించారు. అనంతరం కమింగ్ టుగేదర్ ఫర్ డిస్సమినేషన్ ఆఫ్ నాలెడ్జ్ అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో బి.విజయభాస్కర్ మాట్లాడుతూ అత్యంత ప్రధానమైనది గ్రంథాలయమన్నారు.గొప్ప గొప్ప వారందరూ చనిపోయే దాకా పుస్తకాలను చదువుతూ ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకునేవారన్నారు. మంచి లక్షణాలు మంచి ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సొసైటీ సహాయ కార్యదర్శి డాక్టర్ డీవీ సూర్యారావు, వైస్ ప్రెసిడెంట్ టీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దొరికిన బంగారు గొలుసు అప్పగింత

సీతంపేట, ఆగస్టు 22: సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కి చెందిన వాసుపల్లి దివ్య ఈనెల 16వ తేదీ శ్రావణ శుక్రవారం పూజల నిమిత్తం ఇంటి నుంచి వెళ్తూ తాను ధరించిన మూడు తులాల బంగారు గొలుసు పడిపోయింది. ఈ మేరకు ఆమె నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఈనెల 21వ తేదీన సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కి చెందిన భానూరి శ్రీనివాసరావు పట్నాయక్ అనే వ్యక్తి తనకు బంగారు నక్లెస్ దొరికిందని జోన్-1 క్రైమ్ ఏసీపీ వెంకటరావుకు తెలియపరిచాడు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆ బంగారు ఆభరణం దివ్యకు చెందినదిగా గుర్తించారు. గురువారం నాలుగోపట్టణ పోలీసు స్టేషన్‌లో ఆ బంగారు నక్లెస్‌ను దివ్యకు ఏసీపీ వెంకటరావు, శ్రీనివాసరావు పట్నాయక్ చేతుల మీదుగా అందజేశారు. దొరికిన బంగారు గొలుసు తెచ్చిన శ్రీనివాసరావు పట్నాయక్‌ను అభినందించారు.

ఘనంగా ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం

జ్ఞానాపురం, ఆగస్టు 22 : స్థానిక సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో గురువారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఫౌండర్స్ ఫియస్టా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఎక్స్ టెంపోర్, పోస్టర్ మేకింగ్ పోటీలు జరిపారు. ఈ పోటీలకు నగరంలోని వీఎస్ కృష్ణ, వినెక్స్, గాయత్రి, సెయింట్ ఆన్స్, ఆదిత్య కళాశాలల నుంచి వంద మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన వారికి కళాశాల ద్వితీయ భాషల విభాగాధిపతి ఆచార్య పీకే జయలక్ష్మీ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆర్గనైజర్లు డాక్టర్ రమణీలత, కె. వసంత, సరోజ్ కుమారి, డా.టి. భాస్కర సుధ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి శ్రావణ పూజలు

పూర్ణామార్కెట్, ఆగస్టు 22 : వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసోత్సవ పూజలు ఘనంగా జరుగుతున్నాయి.గురువారం అమ్మవారిని శ్రావణ లక్ష్మీగా అలంకరించి, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రెండు వారాలుగా ఆలయంలో ప్రత్యేక హోమాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం శ్రావణలక్ష్మీగా అమ్మవారిని అలంకరించి పూజలు జరపనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో వి. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం, ఆగస్టు 22 : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను మెడికవర్ ఆస్పత్రిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పార్టీ నాయకులతో కలిసి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. క్షతగాత్రులకు అందుతున్న చికిత్సపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమగ్ర విచారణకు ఆదేశించారని చెప్పారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు మెరుగుపరిచి కార్మికులకు భరోసా కల్పిస్తామని తెలిపారు.మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 22 : విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ తెలిపారు. అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, విద్యుత్‌నగర్, రిజిస్టర్ ఆఫీస్, లేబర్ ఆఫీస్, ఎన్‌జీజీఓ కాలనీ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. అలాగే దుర్గా కైలాస్‌నగర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అందుకోసం వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీతమ్మధార : విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతమ్మధార టీపీటీ కాలనీ, గణేష్ బాబు ఆసుపత్రి ప్రాంతం, హిందు ప్రెస్ ప్రాంతం, ఎస్‌బీఎం లా కళాశాల, సీతంపేట, దుర్గాగణపతి ఆలయం ప్రాంతం, విజయ మెడికల్ ప్రాంతం, సీతమ్మధార పరసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్ ఈఈ బి. సింహచలం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

25 నుంచి డీఎస్సీ కోచింగ్‌కు ఏర్పాట్లు

కంచరపాలెం, ఆగస్టు 22 : కంచరపాలెం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బొట్టా నరసింగరావు భవన్‌లో అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ఈనెల 25 నుంచి ప్రారంభించనున్నారు. అర్హులైన డీఈడీ, బీఈడీ పూర్తి చేసిన వారు ఈసదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టడీ సర్కిల్ కో-ఆర్డినేటర్ పి.సతీష్ కోరారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, ఐక్య ఉపాధ్యాయ వేదిక (యూటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కోచింగ్ సెంటర్‌లో నామమాత్రపు ఫీజుతో ప్రవేశం కల్పిస్తారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుంది. సెలవు రోజుల్లో రోజంతా తరగతులు నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు 9347205549 ఫోన్ నంబర్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సతీష్ కోరారు.

'ప్రేమ జంటకు రక్షణ కల్పించాలి'

డాబాగార్డెన్స్, ఆగస్టు 22 : ప్రేమించి, వివాహం చేసుకున్న జంటకు వారి కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని మహిళా చేతన కార్యదర్శి కె. పద్మ విజ్ఞప్తి చేశారు. గురువారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నూతన జంటతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. పెందుర్తిలోని కృష్ణాపురానికి చెందిన అరసాడ వెంకటేష్ (32), విజయనగరం జిల్లాకు చెందిన తామాడ వినీత (25) ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నారని తెలిపారు. వారి వివాహానికి వినీతి కుటుంబ సభ్యులకు ఇష్టం లేదని, ముఖ్యంగా ఆమె బంధువు రిజర్వు ఎస్ఐ భగవాన్ యువతిని బెదిరిస్తున్నట్టు ఆరోపించారు. వినీతను బలవంతంగా ఓ డెంటిస్ట్‌కి ఇచ్చి వివాహం చేయాలని ప్రయత్నించగా, ఆమె తప్పించుకొని తమను ఆశ్రయించిందని తెలిపారు. తాము సింహాచలంలో వారికి వివాహం చేశామని చెప్పారు. చట్ట ప్రకారం నూతన జంటకు రక్షణ కల్పించి ఆదుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో వెంకటేష్ తల్లిదండ్రులు వినీతి తల్లి, మహిళా చేతన సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు


వేడుకలు నిర్వహిస్తున్న కందుల నాగరాజు, అభిమానులు

అల్లిపురం, ఆగస్టు 22 : కేంద్ర మాజీ మంత్రి, ప్రముఖ సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు 32వ వార్డులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేశారు. అనంతరం కందుల మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో స్వశక్తితో ఎదిగి, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల్లో మంచి స్థానం సంపాదించుకున్న వ్యక్తి చిరంజీవి అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంత్రి శాలివాహన్, కందుల కృష్ణ, చిన్ని, అప్పారావు, దొడ్డి వరలక్ష్మి, శ్రీదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో పని లేదా?

... 5వ పేజీ తరువాయి

చేయించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిసింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులతో వారాల తరబడి రాత్రులు నిద్ర లేకుండా పనులు చేయిస్తున్నారని, ఒక్కొక్క కాంట్రాక్టు కార్మికుడు 12 గంటల పాటు పనిచేస్తున్నారని సమాచారం. వీరికి కాంట్రాక్టర్ భోజన, వసతి సౌకర్యాలు కల్పించి నెలకు రూ.12 వేలు జీతం ఇస్తున్నారు. వసతి కూడా రేకుల షెడ్డుల్లో ఇస్తున్నారు. వీరికి సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు.


సరైన ఆస్పత్రి ఏది?

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన అచ్యుతాపురంలో సరైన ఆస్పత్రి లేదు. ఇక్కడ సుమారు 450కి పైగా కర్మాగారాలు ఉన్నాయి. 30 వేల మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. కానీ ఇక్కడ సరైన అస్పత్రి లేదు. అచ్యుతాపురం, హరిపాలెంలలో పీహెచ్‌సీలు మాత్రమే ఉన్నాయి. వీటిలో సరైన మందులు, సౌకర్యాలు, సిబ్బంది లేరు. సెజ్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి కోసం గత వైసీపీ ప్రభుత్వం రెండెకరాలు స్థలం కేటాయించింది. అయితే ఐదేళ్ల పాలనతో కేవలం ప్రహరీ మాత్రమే నిర్మించింది. కూటమి ప్రభుత్వమైనా కర్మాగారాల్లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించే చర్యలు తీసుకోవడంతో పాటు ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

సందడిగా 'ఉత్తరాంధ్ర జానపద జాతర'

సిరిపురం, ఆగస్టు 22 : మన సంస్కృతి, సాంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రైటర్స్ అకాడమీ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జానపద జాతర 2024 కార్యక్రమాన్ని సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనంలో నుంచి పుట్టినవే జానపదం అన్నారు. ఏపీలో సాంస్కృతిక వైభవం సాధిస్తామన్నారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ జానపద కళాకారులను బతికిస్తున్న రైటర్స్ అకాడమీకి ధన్యవాదాలు తెలిపారు. హాస్య నటుడు, పద్మశ్రీ బ్రహ్మానందం మాట్లాడుతూ ఇక్కడకు వచ్చిన వారంతా టీచర్లేనని, తనకు రమణమూర్తి అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. కార్యక్రమంలో మాజీమంత్రి దాడివీరభద్రరరావు, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ రమణమూర్తి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో హోం మంత్రి అనిత





'ప్రశాంతి'కి బెంగళూరు క్యాంట్ స్టేషన్‌లో హాల్ట్ తొలగింపు

విశాఖపట్నం, ఆగస్టు 22 : బెంగళూరు కంటోన్మెంట్ స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్-1,2ల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18463/18464) బీఎన్‌సీ స్టేషన్‌లో సెప్టెంబరు 19వ తేదీ నుంచి హాల్ట్‌ను తాత్కాలికంగా తొలగించనున్నట్టు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో భువనేశ్వర్ నుంచి కేసీఆర్ బెంగళూరు వెళ్లే 18463 నంబరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 19వ తేదీ నుంచి డిసెంబరు 19వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కేసీఆర్ బెంగళూరు నుంచి భువనేశ్వర్ వచ్చే 18464 నంబరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 20వ తేదీ నుంచి డిసెంబరు 20వ తేదీ వరకు బెంగళూరు క్యాంట్ స్టేషన్‌లో హాల్ట్ ఉండదన్నారు. ప్రయాణికుల గమనించాలన్నారు.

నేడు రెండున్నర గంటల ఆలస్యంగా బొకారో ఎక్స్‌ప్రెస్

నిర్ణీత సమయానికి జత రేక్ అందుబాటులో లేకపోవడంతో అలెప్పీ-దనబాద్ బొకారో ఎక్స్‌ప్రెస్ (13352) శుక్రవారం (23న) ఒరి జినేటింగ్ నుంచి రెండున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరే విధం గా రీ షెడ్యూల్ చేశామని రైల్వే అధికారులు తెలిపారు. దీంతో శుక్రవారం ఉదయం 6.00 గంటలకు అలెప్పీలో బయలుదేరాల్సిన ఈ రైలు ఉదయం 8.45 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు.

ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ వేగవంతం

... 5వ పేజీ తరువాయి

పోర్టు ముందుకువచ్చింది. దీంతో పోర్టు వాటా రూ.50.96 కోట్లకు చేరింది. ఏడాదిన్నర క్రితం ప్రారంభమైన ఈ పనులు వైసీపీ హయాంలో నత్తనడకన సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు దీనిపై సమీక్షించి హార్బర్ ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్‌కు బాధ్యత అప్పగించారు. దాంతో ఆయన తరచూ సమీక్షలు నిర్వహిస్తూ, పనులు వేగవంతం చేస్తున్నారు.ప్రస్తుత హార్బర్‌లో డిమాండ్‌కు అనుగుణంగా వసతుల కల్పన, ఆధునికీకరణ ప్రధాన ధ్యేయం. వేలం హాళ్లు, ప్యాకింగ్ యూనిట్, పార్కింగ్ ఏరియా, ఆఫీసుకు ప్రత్యేక సదుపాయం, రెస్ట్ రూమ్, క్యాంటీన్, చేపలు ఎండబెట్టుకోవడానికి పరిశుభ్రమైన యార్డులు, చేపలు నిల్వ చేసుకునే సదుపాయం, ఫ్లోటింగ్ జెట్టీలు, వాటికి రిటైనింగ్ గోడలు, మురుగునీటిని శుద్ధిచేసే ప్లాంటు, అంతర్గత రహదారులు, అండర్ గ్రౌండ్ రిజర్వాయర్, ఓవర్ హెడ్ ట్యాంక్, సోలార్ విద్యుద్దీపాలు ఏర్పాటుచేస్తామని డీపీఆర్‌లో పొందుపరిచారు. ఈ పనులన్నింటినీ ఏడు దశలుగా విడదీసి వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. ఆర్‌సీసీ పైల్డ్ జెట్టీ నిర్మాణానికి డిజైన్ తయారు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు మురుగునీటి శుద్ధి కేంద్రం అందుబాటులోకి తేనున్నారు.


నిర్మాణంలో ఉన్న భవనం

పోర్టు అదనపు నిధులతో..

పోర్టు అదనంగా సమకూర్చిన రూ.26.7 కోట్లతో రెండు ఫింగర్ జెట్టీలు, నాలుగో నంబరు జెట్టీ నుంచి 11వ నంబరు జెట్టీ వరకు వార్ఫ్ నిర్మాణం, అదనంగా మరో వేలంహాలు నిర్మించనున్నారు. కొత్త వేలం హాలును ఏసీ సదుపాయంతో ఏర్పాటు చేస్తారు. బోట్ల నుంచి దించిన చేపలు, రొయ్యలను వేలం హాళ్లకు కన్వేయరు బెల్టుల ద్వారా పంపే ఏర్పాట్లుంటాయి. దించి, ఎత్తడం వల్ల సముద్ర ఉత్పత్తులు పాడైపోకుండా ఈ సదుపాయం కల్పిస్తున్నారు.





కరణంరెడ్డి నరసింగరావును సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

బ్రహ్మర్షి పత్రీజీ ఆదర్శనీయులు

పెదగంట్యాడ, ఆగస్టు 22: బ్రహ్మర్షి పత్రీజీ ఆదర్శనీయులు అని భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. నెల్లిముక్కులోని జీవీఎంసీ కల్యాణ మండపంలో గురువారం పత్రీజీ పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం 14వ వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కరణంరెడ్డి మాట్లాడుతూ గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో శాకాహార ర్యాలీలు, ధ్యాన ప్రచారం, స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యుల సేవలను కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రత్నకుమారిలు మాట్లాడుతూ పత్రీజీ ఆశయ సాధనకు ధ్యాన కేంద్రం సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ఎం.శివనాగేశ్వరరావు, కార్తీక్, వంశీ కిరణ్, సత్యవతి, రమణమ్మ, మోహన్, డాక్టర్ భాగ్యగౌరి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై శ్రీనివాస హోమం



ఆలయ ఆవరణలో హోమం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి, ఆగస్టు 22: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో చాతుర్మాస దీక్షల్లో భాగంగా భాగంగా గురువారం శ్రీనివాస హోమం, వేంకటేశ్వరస్వామి నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎంఎస్ రాజు దంపతులు పూజల్లో పాల్గొన్నారు

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

అగనంపూడి, ఆగస్టు 22: జీవీఎంసీ 85వ వార్డు పరిధి చిరు అభిమాన సంఘం ఆధ్వర్యంలో సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదమడకలోని సంపత్ వినాయక ఆలయంలో చిరంజీవి పేరిట ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేయడంతో పాటు 69 కిలోల కేక్ కట్ చేశారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలోని రోగులు, గర్భిణులు, బాలింతలకు పండ్లు, పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమాన సంఘం ప్రతినిధులు పి.వసంతరావు, ఎం.వెంకటరమణ, ఎం.శ్రీనివాసరావు, ఎం.మురళీకృష్ణ వి.నారాయణరావు, జి.వెంకటేశ్వరరావు, గంగరాజు, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు పనులు పరిశీలన



చెరువు ఆధునీకరణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 22: సుమారు కోటి రూపాయల వ్యయంతో ఆధునీకరిస్తున్న నాతయ్యపాలెం కృష్ణ మహంతి చెరువు పనులను గురువారం 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పరిశీలించారు. చెరువు గట్టుపై చేపడుతున్న విద్యుత్ దీపాల పనులను తిలకించి, పలు సూచనలు చేశారు. త్వరగా చెరువు పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టరు, అధికారులకు ఆదేశించారు.

సినిమా గైడ్

- **తంగలాన్ :** శారద, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** కామేశ్వరి, మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), కన్య, విశేష్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, సంగం, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం).
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)
- **భారతీయుడు-2 :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 27, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 22, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 24, క్యారెట్ 32, దొండకాయలు 28, బంగాళదుంపలు 34, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 40, కీరదోస 28, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడుచిక్కుడు 76, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలి

- ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్రం విరమించుకోవాలి
- మహా ధర్నాలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు



స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 22: స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు కర్మాగారంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని, ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద మహా ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్లాంటులో పూర్తి స్థాయి ఉత్పత్తి చేయకపోవడం వల్ల కర్మాగారానికి నష్టాలు వస్తున్నాయన్నారు. ఉత్పత్తి పెంచేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నప్పటికీ అందుకు తగ్గ ఏర్పాట్లను యాజమాన్యం చేయడం లేదని ఆరోపించారు. ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే విరమించుకోవాలన్నారు. దేశంలో ఇతర స్టీల్‌ప్లాంటుల ఉద్యోగులు కొత్త జీతాలు తీసుకుంటుంటే, ఇక్కడ మాత్రం ఉన్న పాత జీతాలకే దిక్కు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్మాగారంలో పని ప్రదేశంలో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉజ్వల భవిష్యత్తు కలిగిన ప్లాంటును నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. పొదుపు చర్యల పేరుతో ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుండడం శోచనీయమని పేర్కొన్నారు.

ఇదిలావుండగా పోరాట కమిటీ నాయకుల మహాధర్నా సందర్భంగా ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ పర్యవేక్షణలో స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు పటిష్ఠ చర్యలు చేపట్టారు. ముందస్తు చర్యల్లో భాగంగా పరిపాలన భవనం ప్రధాన గేటు వద్ద ఇనుప కంచెను ఏర్పాటు చేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ధర్నాలో భాగంగా నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పరిపాలన భవనం ముందు బైఠాయించడంతో పాటు మధ్యాహ్నం భోజనం కూడా అక్కడే చేసి నిరసన తెలిపారు. తమ సమస్యలపై ఉక్కు యాజమాన్యం తక్షణమే స్పందించకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, నమ్మి సింహాద్రి, విల్లా రామ్మోహన్‌కుమార్, యు.రామస్వామి, వైటీ దాసు, తదితరులు పాల్గొన్నారు.



అడ్మిన్ భవనంలోకి ఎవరూ ప్రవేశించకుండా ఏర్పాటు చేసిన ఇనుప కంచె, బందోబస్తు

హై టెన్షన్ విద్యుత్ లైన్లతో ఇబ్బందులు

బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న ప్రజలు

గాజువాక, ఆగస్టు 22: గాజువాకలోని ప్రాంతాల్లో ఇళ్ల మధ్యలో ఉన్న హై టెన్షన్ (హెచ్‌టీ) విద్యుత్ లైన్ల మూలంగా ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈదురుగాలుల సమయంలో, వర్షాలు కురిసేటప్పుడు ఆయా విద్యుత్ స్తంభాల వద్ద చిన్నపాటి మంటలు వస్తుండడంతో స్థానికులు భీతిల్లుతున్నారు.

గాజువాక పరిధిలో ఆటోనగర్, ఎల్‌వీ నగర్, చట్టివానిపాలెం, శ్రీనివాస నగర్, దత్తసాయి నగర్, పల్లావారి వీధి, డ్రైవర్స్ కాలనీ, కుంచుమాంబ కాలనీ, తదితర ప్రాంతాల మీదుగా హెచ్‌టీ విద్యుత్ లైను ఉన్నాయి. వీటిని తొలగించాలంటూ ఆయా ప్రాంతాల ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. హెచ్‌టీ విద్యుత్ లైన్లు ఇళ్లకు సమీపంలో ఉండడం వల్ల దుస్తులు ఆరేసినప్పుడు, మేడపైకి వెళ్లినప్పుడు విద్యుదాఘాతానికి గురై పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. అందువల్ల ఉన్నతాధికారులు స్పందించి ప్రజావాసాలకు దూరంగా హెచ్‌టీ విద్యుత్ లైన్లను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



పాత గాజువాకలో నివాసాలకు చేరువలో ఉన్న హెచ్‌టి విద్యుత్ వైర్లు

స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో ఇతరుల నివాసం!

క్వార్టర్లను అద్దెకు ఇస్తున్న పలువురు ఉద్యోగులు

అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 22: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు నివాసం ఉండాల్సిన క్వార్టర్స్ ఇప్పుడు అద్దెకు లభిస్తున్నాయి. పలువురు ఉద్యోగులు తమ పేరిట క్వార్టర్స్ తీసుకుని ఇతరులకు ఎక్కువ నగదుకు అద్దెకు ఇస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగులు మాత్రమే ఉండాల్సిన క్వార్టర్స్‌లో ఇతరులు ఉంటున్నారని తెలిసినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహించే ఉద్యోగుల కోసం టౌన్‌షిప్‌లో మొత్తం 12 సెక్టార్లలో క్వార్టర్స్ ఉన్నాయి. ఇక్కడ ఉద్యోగులు, తమ కుటుంబ సభ్యులు తప్ప ఇతరులు నివాసం ఉండడానికి వీల్లేదు. కానీ ఇప్పుడు ఈ క్వార్టర్స్‌లో ఎక్కువ శాతం మంది ఇతరులే నివాసం ఉంటున్నారన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. ఉద్యోగులు కాకుండా ఇతరులు ఇక్కడ నివాసం ఉండడం వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఉక్కు ఉద్యోగుల్లో చాలామందికి సొంతిళ్లు ఉండడంతో అక్కడకు వెళ్లిపోయారు.

అయితే టౌన్‌షిప్‌లో క్వార్టర్స్ ఖాళీ చేస్తే హెచ్‌ఆర్‌ఏ రాదని, అందువల్ల తమ పేరిట ఉన్న క్వార్టర్స్‌ను ఇతరులకు అద్దెకు ఇస్తున్నారు. టౌన్‌షిప్‌లో ఏ-టైప్ క్వార్టర్‌ను రూ.ఆరు వేలు, బీ-టైప్ క్వార్టర్‌ను రూ.పది వేలకు ఉక్కు ఉద్యోగులు అద్దెకు ఇస్తున్నారని బహిరంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉక్కు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా ఫలితం లేకపోవడంతో విజిలెన్స్ విభాగం తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే అద్దెకు క్వార్టర్స్ ఇచ్చిన ఉద్యోగుల పైనా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

ఆర్‌అండ్‌టీ కార్మికుల పెన్షన్ తేదీలను మార్చాలి

భెల్ హెచ్‌పీవీపీ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



భెల్ హెచ్‌పీవీపీ మెయిన్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 22: ఆర్‌అండ్‌టీ సిరీస్ కార్మికుల పెన్షన్ అమలు తేదీలలో మార్పులు చేయాలంటూ భెల్ హెచ్‌పీవీపీ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో గురువారం కార్మికులు కర్మాగారం మెయిన్ గేటు వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి జీటీవీ ప్రకాశ్ మాట్లాడుతూ 1989, 1992లో కర్మాగారంలో చేరిన ఆర్‌అండ్‌టీ సిరీస్ కార్మికులను 2011లో పర్మినెంట్ చేసిన యాజమాన్యం.. పెన్షన్ అమలును కూడా పర్మినెంట్ తేదీతో ముడిపెట్టడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

అందువల్ల యాజమాన్యం పెన్షన్ అమలులో ద్వంద్వ వైఖరిని విడనాడి కార్మికులకు క్యాజువల్ సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్మిక సంఘ మాజీ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు మాట్లాడుతూ ప్రస్తుత గుర్తింపు కార్మిక సంఘం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కార్మిక సమస్యలపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం కార్మికులు కర్మాగారం మెయిన్ గేటు నుంచి అడ్మిన్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి పీఎఫ్ ట్రస్టు అధికారి వి.మహంతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.రామునాయుడు, సీతన్‌నాయుడు, సనపల జగన్నాథరావు, వారాడ ఆనందరావు, కె.విజయ్‌కుమార్, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులు

ఇబ్బందులకు గురవుతున్న స్థానికులు

పెందుర్తి, ఆగస్టు 22: స్థానిక బీఆర్‌టీఎస్ రహదారి వద్ద గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సమీప పరిసర ప్రాంతాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. సమీపంలోనే మద్యం దుకాణాలు ఉండడంతో మందుబాబులు ఈ బ్రిడ్జి సమీప ప్రాంతాలను బార్‌లా మార్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి మద్యం దుకాణం పక్కనే వుడా కాలనీ ప్రధాన రహదారి ఉండడంతో మందుబాబుల వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రిపూట ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై మద్యం తాగాక ఖాళీ సీసాలు, తదితర వాటిని ఎక్కడికక్కడ మందుబాబులు వదిలేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై ఖాళీ మద్యం సీసాలు, కవర్లు



క్షతగాత్రున్ని చూస్తున్న టీడీపీ నాయకులు

క్షతగాత్రులను పరామర్శించిన కార్పొరేటర్

కూర్మన్నపాలెం, ఆగస్టు 22: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా కంపెనీలో బాధితులకు ఉన్నత వైద్యం అందించే చర్యల్లో భాగంగా 87వ వార్డు పరిధి వడ్లపూడి పవన్ సాయి ఆస్పత్రిలో వైద్య సేవలందిస్తున్నారు. ఇక్కడ చికిత్స పొందుతున్న బండి శశికాంత్, పి.శ్రీనివాసరావు, జి.సంతోష్, జె.ప్రకాశ్, టి.గంగాధర్, పి.జగదీశ్, జి.సాయికుమార్, జె.కాశీ నాయుడు, లోవ శ్రీనివాస్‌లను గురువారం ప్రజారోగ్య విభాగ ఉన్నతాధికారులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్ పరామర్శించారు. బాధితులకు అండగా ప్రభుత్వం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్ వెంట స్థానిక నాయకులు విజయరామరాజు, రాజన్‌రాజు, తదితరులు ఉన్నారు.

ఇంకుడు గుంతలతో ఎంతో మేలు



ఇంకుడు గుంతలో చేరిన వర్షపు నీరు

కూర్మన్నపాలెం, ఆగస్టు 22: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లో గురువారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల తవ్వకాల పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ కార్యదర్శి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కాలనీలో భూగర్భ జలాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఇప్పటికే పలుచోట్ల ఇంకుడు గుంతలు తవ్వించామని, వీటివల్ల ఎంతో మేలు కలుగుతుందన్నారు. తాము తవ్వించిన ఇంకుడు గుంతల్లో వర్షపు నీరు చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, పరమానందం, పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సహకారం

ఆటోనగర్, ఆగస్టు 22: జీవీఎంసీ 70వ వార్డు పరిధి ఎల్‌వీ నగర్‌లో గురువారం ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థి ఆర్.గేయశ్రీకి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు దేనంకొండ కృష్ణంరాజు, సుంకర నారాయణ ప్రసాద్‌లు రూ.పది వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని విద్యార్థినికి సూచించారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ రాధ, బి.సత్యారావు, సుబ్బరాజు, అచ్యుతరావు, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



శ్రీనగర్‌లో వర్షంలో బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు

బస్ షెల్టర్లు లేక అగచాట్లు

ఎండైనా, వానైనా ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 22: శ్రీనగర్, చిన గంట్యాడ, వుడా ఫేజ్-1 కూడళ్ల వద్ద బస్సు ఎక్కాలంటే రహదారుల పక్కన ఉన్న డివైడర్లు పైనో, చెట్లు కిందో, దుకాణాల వద్దో ప్రజలు వేచివుండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండైనా, వానైనా ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా నీడక ఉన్నచోట బస్సులు ఆపకపోవడంతో అవి ఎక్కడ ఆపితే అక్కడకు పరుగులు తీయాల్సి వస్తుందని వాపోతున్నారు. కనీసం ఆయా ప్రాంతాల్లో బస్సులు నిలిపే ప్రదేశమని సూచిక బోర్డులు కూడా లేకపోవటంతో తాము ఎక్కడ నిలబడాలో తెలియని దుస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. పలువురు ఆర్టీసీ డ్రైవర్లు కూడా ప్రజలు వేచివున్న చోట కాకుండా దూరంగా బస్సులను ఆపుతున్నారని, దీనివల్ల బస్సులు ఎక్కేందుకు వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొంటున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి ఆయా కూడళ్లలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయడంతో బస్సులు నిలిపే స్థలమని సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలనం పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్‌ను కలిసిన కార్పొరేటర్



డైరెక్టర్ అబ్రహం వరుగీస్‌కు పూల మొక్క అందజేస్తున్న బొమ్మిడి రమణ

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 22: జీవీఎంసీ 90వ వార్డులో ఉన్న ఎన్ఎస్‌టీఎల్ కార్యాలయంలో డైరెక్టర్ అబ్రహం వరుగీస్‌ను గురువారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌కు పూల మొక్కను అందజేశారు. వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రిడెంట్ ఎన్ఎస్‌టీఎల్ నమూనా అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. అలాగే వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను అబ్రహం వరుగీస్‌కు వివరించారు. భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి పనులకు సీఎస్ఆర్ నిధుల కింద సహకారాన్ని అందించవలసిందిగా ఆయనకు కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరవ పైడిరాజు, ఎలమంచిలి కిశోర్, లావణ్యకుమార్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు

మల్కాపురం, ఆగస్టు 22: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు పశువులకు టీకాలు వేస్తున్నామని మల్కాపురం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పశువైద్యశాల అధికారి డాక్టర్ సునీల్ అన్నారు. ఇక్కడి పశువుల ఆస్పత్రిలో బుధవారం కొన్ని పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 19వ తేదీ వరకు పశువులకు టీకాలు వేసే ప్రక్రియ కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులకు నోటిలో, కాళ్ల మధ్య కురుపులు రావడం వల్ల అవి మేత సరిగ్గా తినక పాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంటుందని, దీనివల్ల పెంపకందారులు నష్టపోతారన్నారు. తమ ఆస్పత్రిలో ప్రతిరోజు 65 పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా అధికారి రామకృష్ణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయనన్నారు.

చేతుల పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు అవగాహన



బ్యానర్, ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఎంఈవో దివాకర్, ఉపాధ్యాయులు

గోపాలపట్నం, ఆగస్టు 22: చేతుల పరిశుభ్రతపై శ్రద్ధ చూపడం వల్ల అనేక వ్యాధుల బారినపడకుండా జాగ్రత్త పడవచ్చని గోపాలపట్నం ఎంఈవో దివాకర్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చేతుల పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈవో మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన వంద పాఠశాలల్లో చేతుల పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల కలిగే లాభాలపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. వరల్డ్ హ్యాండ్ వాష్ డే, వరల్డ్ టాయిలెట్ డే, మెన్సువల్ హైజిన్ డే సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించనున్నట్టు దివాకర్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో జరిగే డెటాల్ హైజిన్ ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థులు పాల్గొనేలా శిక్షణ ఇవ్వాలిని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. అనంతరం చేతులు శుభ్రపరుచుకోవడం వల్ల చేకూరే ప్రయోజనాలను వివరిస్తూ బ్యానర్, ప్లకార్డులను ప్రదర్శించారు.


పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి

మల్కాపురం, ఆగస్టు 22: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్ జగదేశ్వరరావు అన్నారు. ఎల్‌అండ్‌టీ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విజ్ఞాన్ టాలెంట్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అలాగే భూగర్భ జలాలను కాపాడేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం 200 మందికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ అధికారి శ్యామ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్యదర్శికి బదిలీ

విశాఖపట్నం : జీవీఎంసీ కార్యదర్శి నల్లనయ్యను విజయనగరం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు.









విశాఖలో ఒబెరాయ్ ఫైవ్ స్టార్ హోటల్

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్



కేక్ కట్ చేస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, ఆగస్టు 22: విశాఖపట్నంలో ఒబెరాయ్ యాజమాన్యం ఫైవ్ స్టార్ హోటల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ మేరకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. గురువారం సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన నగర పార్టీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రిని జనసేన పార్టీ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఇక్కడ ఉన్న ప్రసిద్ధి పుణ్యక్షేత్రాలు, సముద్ర తీరప్రాంత అందాలు, అరకులోయ, లంబసింగి వంటి ప్రాంతాలన్నింటిని కలుపుతూ ఒక టూరిజం సర్క్యూట్‌ను తయారు చేస్తామన్నారు. ఒక పర్యాటకుడు విశాఖపట్నానికి సందర్శనకు వస్తే రెండు, మూడు రోజులు ఉండే విధంగా ప్రణాళికను తయారు చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తామన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి టూరిజం అభివృద్ధిపై చాలా శ్రద్ధ కనబరుస్తున్నారని మంత్రి దుర్గేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా తయారు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. జనసేన కార్యకర్తలు, అభిమానులను కలిసి పార్టీని మరింత ముందుకు తీసుకొని వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరిపురం : ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలని మంత్రి కందుల దుర్గేష్‌ను ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ, ఈవెంట్ మేనేజర్ల అసోసియేషన్ సంయుక్తగా కోరారు. గురువారం వారు బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు.రాష్ట్రంలో ప్రతిబావంతమైన ఈవెంట్ మేనేజర్లు ఉన్నారని, ఏటా కోట్లాది రూపాయల టర్నోవర్ బిజినెస్ చేస్తున్నారని వివరించారు. అనుమతులు త్వరితగతిన ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 22 : జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న వార్షిక లీగ్ టోర్నీలో భాగంగా వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో చాంపియన్స్ సీసీ 132 పరుగుల భారీ తేడాతో ఎన్ఏడీ సీసీపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన చాంపియన్స్ సీసీ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 340 పరుగులు చేసింది. ఓపెనర్ హరికిరణ్ సెంచరీ (107), ఏఎన్.కిరణ్ హాఫ్ సెంచరీ (64) సాధించగా రాకేష్ (46), త్రినాథ్ (35) రాణించారు. ఎన్ఏడీ బౌలర్లలో జస్బీర్ సింగ్, చందు చెరో మూడు వికెట్లు తీశారు. లక్ష్య ఛేదనలో ఎన్ఏడీ సీసీ 34.3 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. గోపీనాథ్ (51), వినయ్ (58) అర్ధ సెంచరీలు చేయగా చందు (32) రాణించాడు. చాంపియన్స్ సీసీ బౌలర్ శివరామారావు ఐదు వికెట్లు పడగొట్టి ఎన్ఏడీ బ్యాట్స్‌మెన్‌ను పెవిలియన్ దారి పట్టించగా హరికిరణ్, సాయి శ్రీహర్ష చెరో రెండు వికెట్లు తీసి సహకరించారు.

సాధనతోనే విజయం సాధ్యం : విద్యా శాఖ ఆర్‌జేడీ



సమావేశంలో మాట్లాడుతున్న విద్యా శాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్

సీతంపేట, ఆగస్టు 22 : స్థిర లక్ష్యం, సాధన ద్వారా విజయం సాధించవచ్చునని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. గురువారం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డీఎస్ వర్మ గ్రంథాలయంలో అన్ని విభాగాలను చూపించారు. అనంతరం కమింగ్ టుగేదర్ ఫర్ డిస్సెమినేషన్ ఆఫ్ నాలెడ్జ్ అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో బి.విజయభాస్కర్ మాట్లాడుతూ అత్యంత ప్రధానమైనది గ్రంథాలయమన్నారు.గొప్ప గొప్ప వారందరూ చనిపోయే దాకా పుస్తకాలను చదువుతూ ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకునేవారన్నారు. మంచి లక్షణాలు మంచి ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సొసైటీ సహాయ కార్యదర్శి డాక్టర్ డీవీ సూర్యారావు, వైస్ ప్రెసిడెంట్ టీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దొరికిన బంగారు గొలుసు అప్పగింత

సీతంపేట, ఆగస్టు 22: సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కి చెందిన వాసుపల్లి దివ్య ఈనెల 16వ తేదీ శ్రావణ శుక్రవారం పూజల నిమిత్తం ఇంటి నుంచి వెళ్తూ తాను ధరించిన మూడు తులాల బంగారు గొలుసు పడిపోయింది. ఈ మేరకు ఆమె నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఈనెల 21వ తేదీన సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కి చెందిన భానూరి శ్రీనివాసరావు పట్నాయక్ అనే వ్యక్తి తనకు బంగారు నక్లెస్ దొరికిందని జోన్-1 క్రైమ్ ఏసీపీ వెంకటరావుకు తెలియపరిచాడు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆ బంగారు ఆభరణం దివ్యకు చెందినదిగా గుర్తించారు. గురువారం నాలుగోపట్టణ పోలీసు స్టేషన్‌లో ఆ బంగారు నక్లెస్‌ను దివ్యకు ఏసీపీ వెంకటరావు, శ్రీనివాసరావు పట్నాయక్ చేతుల మీదుగా అందజేశారు. దొరికిన బంగారు గొలుసు తెచ్చిన శ్రీనివాసరావు పట్నాయక్‌ను అభినందించారు.

ఘనంగా ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం

జ్ఞానాపురం, ఆగస్టు 22 : స్థానిక సెయింట్ జోషఫ్ మహిళా కళాశాలలో గురువారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఫౌండర్స్ ఫియస్టా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఎక్స్ టెంపోర్, పోస్టర్ మేకింగ్ పోటీలు జరిపారు. ఈ పోటీలకు నగరంలోని వీఎస్ కృష్ణ, వినెక్స్, గాయత్రి, సెయింట్ ఆన్స్, ఆదిత్య కళాశాలల నుంచి వంద మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన వారికి కళాశాల ద్వితీయ భాషల విభాగాధిపతి ఆచార్య వీకే జయలక్ష్మీ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆర్గనైజర్లు డాక్టర్ రమణీలత, కె. వసంత, సరోజ్ కుమారి, డా.టి. భాస్కర సుధ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి శ్రావణ పూజలు

పూర్ణామార్కెట్, ఆగస్టు 22 : వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసోత్సవ పూజలు ఘనంగా జరుగుతున్నాయి.గురువారం అమ్మవారిని శ్రావణ లక్ష్మీగా అలంకరించి, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రెండు వారాలుగా ఆలయంలో ప్రత్యేక హోమాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం శ్రావణలక్ష్మీగా అమ్మవారిని అలంకరించి పూజలు జరపనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో వి. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం, ఆగస్టు 22 : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను మెడికవర్ ఆస్పత్రిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పార్టీ నాయకులతో కలిసి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. క్షతగాత్రులకు అందుతున్న చికిత్సపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమగ్ర విచారణకు ఆదేశించారని చెప్పారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు మెరుగుపరిచి కార్మికులకు భరోసా కల్పిస్తామని తెలిపారు.మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 22 : విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ తెలిపారు. అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, విద్యుత్‌నగర్, రిజిస్టర్ ఆఫీస్, లేబర్ ఆఫీస్, ఎన్‌జీజీఓ కాలనీ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. అలాగే దుర్గా కైలాస్‌నగర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అందుకోసం వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీతమ్మధార : విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతమ్మధార టీపీటీ కాలనీ, గణేష్ బాబు ఆసుపత్రి ప్రాంతం, హిందు ప్రెస్ ప్రాంతం, ఎన్‌బీఎం లా కళాశాల, సీతంపేట, దుర్గాగణపతి ఆలయం ప్రాంతం, విజయ మెడికల్ ప్రాంతం, సీతమ్మధార పరసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్ ఈఈ బి. సింహచలం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

25 నుంచి డీఎస్సీ కోచింగ్‌కు ఏర్పాట్లు

కంచరపాలెం, ఆగస్టు 22 : కంచరపాలెం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బొట్టా నరసింగరావు భవన్‌లో అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ఈనెల 25 నుంచి ప్రారంభించనున్నారు. అర్హులైన డీఈడీ, బీఈడీ పూర్తి చేసిన వారు ఈసదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టడీ సర్కిల్ కో-ఆర్డినేటర్ పి.సతీష్ కోరారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, ఐక్య ఉపాధ్యాయ వేదిక (యూటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కోచింగ్ సెంటర్‌లో నామమాత్రపు ఫీజుతో ప్రవేశం కల్పిస్తారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుంది. సెలవు రోజుల్లో రోజంతా తరగతులు నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు 9347205549 ఫోన్ నంబర్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సతీష్ కోరారు.

'ప్రేమ జంటకు రక్షణ కల్పించాలి'

డాబాగార్డెన్స్, ఆగస్టు 22 : ప్రేమించి, వివాహం చేసుకున్న జంటకు వారి కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని మహిళా చేతన కార్యదర్శి కె. పద్మ విజ్ఞప్తి చేశారు. గురువారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నూతన జంటతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. పెందుర్తిలోని కృష్ణాపురానికి చెందిన అరసాడ వెంకటేష్ (32), విజయనగరం జిల్లాకు చెందిన తామాడ వినీత (25) ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నారని తెలిపారు. వారి వివాహానికి వినీతి కుటుంబ సభ్యులకు ఇష్టం లేదని, ముఖ్యంగా ఆమె బంధువు రిజర్వు ఎస్ఐ భగవాన్ యువతిని బెదిరిస్తున్నట్టు ఆరోపించారు. వినీతను బలవంతంగా ఓ డెంటిస్ట్‌కి ఇచ్చి వివాహం చేయాలని ప్రయత్నించగా, ఆమె తప్పించుకొని తమను ఆశ్రయించిందని తెలిపారు. తాము సింహాచలంలో వారికి వివాహం చేశామని చెప్పారు. చట్ట ప్రకారం నూతన జంటకు రక్షణ కల్పించి ఆదుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో వెంకటేష్ తల్లిదండ్రులు వినీతి తల్లి, మహిళా చేతన సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న కందుల నాగరాజు, అభిమానులు

అల్లిపురం, ఆగస్టు 22 : కేంద్ర మాజీ మంత్రి, ప్రముఖ సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు 32వ వార్డులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేశారు. అనంతరం కందుల మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో స్వశక్తితో ఎదిగి, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల్లో మంచి స్థానం సంపాదించుకున్న వ్యక్తి చిరంజీవి అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంత్రి శాలివాహన్, కందుల కృష్ణ, చిన్ని, అప్పారావు, దొడ్డి వరలక్ష్మీ, శ్రీదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ కేజీహెచ్, విమ్స్!

... 5వ పేజీ తరువాయి

పలువురు వైద్యులు తీవ్రస్థాయిలో ప్రయత్నాలను సాగిస్తున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ అశోక్‌కుమార్ కొద్దిరోజుల కిందట సెలవుపై వెళ్లారు. దీని వెనుక పలు కారణాలున్నాయి. ఆయన సెలవు ముగియడంతో మళ్లీ వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇదే స్థానాన్ని మరో ముగ్గురు వైద్యులు ఆశిస్తున్నారు. వీరిలో శ్రీకాకుళంలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ అల్లు పద్మజ, ఆంధ్ర మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్మథరావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరూ తమకు తెలిసిన ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలు, ఒక మంత్రి ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు చెబుతున్నారు. అలాగే, ప్రస్తుతం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద కూడా పూర్తిస్థాయి బాధ్యతలను దక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. తాను వచ్చిన తరువాత ఆస్పత్రిలో వైద్యసేవలు మెరుగ్గా అందేలా చేయడంతోపాటు సిబ్బంది క్రమశిక్షణతో మెలిగేలా చూశానని, తన పనితీరును పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరుతున్నారు. ఇందుకు అధికార పార్టీకి చెందిన సీనియర్ నేతను ఆయన సంప్రదిస్తున్నట్టు చెబుతున్నారు. విమ్స్ డైరెక్టర్ పోస్టును పలువురు ఆశిస్తున్నారు. వీరిలో రాజమండ్రి మెడికల్ కళాశాలలో న్యూరో సర్జరీ విభాగంలో పనిచేస్తున్న ఒక ప్రొఫెసర్, గతంలో కేజీహెచ్‌లోనే పని చేసి కాకినాడ బదిలీపై వెళ్లిన మరో న్యూరో సర్జరీ ప్రొఫెసర్, కేజీహెచ్ ఆర్థో విభాగానికి చెందిన ఇంకో ప్రొఫెసర్ ప్రయత్నిస్తున్నట్టు చెబుతున్నారు.

వివాదాస్పద వైద్యుడి యత్నాలు

గతంలో విమ్స్‌లో డిప్యూటేషన్‌పై పనిచేసి రోగులు నుంచి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలతో వెనక్కి వెళ్లిన వైద్యుడే ప్రస్తుతం విమ్స్ డైరెక్టర్‌గా వచ్చేందుకు పావులు ప్రయత్నాలు సాగిస్తుండడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. గతంలో విమ్స్ డైరెక్టర్‌కు చెందిన రోగి నుంచే ఆయన డబ్బులు వసూలు చేసిన వ్యవహారం అప్పట్లో సంచలనమయింది. ఇప్పటికే ఒక సీనియర్ మంత్రి నుంచి సిఫారసు లేఖ ఆయన విజయవాడలోని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చుట్టూ తిరుగుతున్నట్టు తెలిసింది. ఈ వైద్యుడి గురించి విచారించిన ఉన్నతాధికారులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నట్టు చెబుతున్నారు. రోగులతో ఆయన వ్యవహరించే తీరు, ఆస్పత్రిలో సరిగా విధులు నిర్వర్తించకపోవడం వంటి వ్యవహారాలన్నీ వారి విచారణలో తేలినట్టు తెలుస్తోంది. అటువంటి అధికారికి పదవి ఇస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ మంట గలుస్తుందన్న భావనను వ్యక్తం చేస్తున్నారు. ఆ వైద్యుడు మాత్రం తనకు కొద్దిరోజుల్లోనే ఉన్నతస్థాయి పదవి వస్తుందని, చెప్పుకోవడం గమనార్హం. ఇదిలా ఉండగా, ఈ వైద్యుడిపై డీఎంఏకు అందిన ఫిర్యాదు మేరకు నాలుగు రోజుల కిందట విచారణ కమిటీని నియమించారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. ఈ సందర్భంలో సదరు వైద్యుడు విమ్స్ డైరెక్టర్ పోస్టు కోసం పైరవీలు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ప్లేట్‌లెట్స్ డౌన్!

... 5వ పేజీ తరువాయి

20 శాతం కేసులకు మాత్రమే మందులు వాడాల్సి వస్తోందని, పది శాతం కేసుల్లో మాత్రమే రక్త పరీక్షలకు వెళ్లాల్సి వస్తోందని డాక్టర్ సోమయాజులు తెలిపారు. అతి తక్కువ కేసులను మాత్రమే ఆస్పత్రిలో అడ్మిట్ చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోందన్నారు.

ప్లేట్‌లెట్స్ కోసం రోగులు

కాగా జిల్లాలో డెంగ్యూ కేసులు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఈ బాధితుల్లో ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోవడంతో వారి బంధువులు బ్లడ్ బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నాయి. నగర పరిధిలో 35 బ్లడ్ బ్యాంకులుండగా, ఒక్కో చోట రోజుకు కనీసం ఐదు నుంచి పది ప్లేట్‌లెట్స్ బ్యాగులను అందిస్తున్నారు. వారం రోజులుగా ప్లేట్‌లెట్స్ కోసం వస్తున్న వారి సంఖ్య పెరిగిందని వందేభారత్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్‌బాలు తెలిపారు. రోగుల అవసరాలకు అనుగుణంగా ప్లేట్‌లెట్స్ ఏర్పాటుచేయడంపై దృష్టి సారించామని వివరించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో 4,218 మందికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా, 329 మందికి పాజిటివ్‌గా తేలింది. రానున్న రోజుల్లో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆరోగ్యశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో వైరల్ ఫీవర్స్ ఎక్కువగా ఉన్నాయని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. క్షేత్రస్థాయిలో జ్వర పీడితులను పర్యవేక్షించేలా సిబ్బందికి ఆదేశాలిచ్చామని, మూడు రోజులకు మించి జ్వర లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నైపుణ్యంతో పని లేదా?

... 5వ పేజీ తరువాయి

చేయించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిసింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులతో వారాల తరబడి రాత్రులు నిద్ర లేకుండా పనులు చేయిస్తున్నారని, ఒక్కొక్క కాంట్రాక్టు కార్మికుడు 12 గంటల పాటు పనిచేస్తున్నారని సమాచారం. వీరికి కాంట్రాక్టర్ భోజన, వసతి సౌకర్యాలు కల్పించి నెలకు రూ.12 వేలు జీతం ఇస్తున్నారు. వసతి కూడా రేకుల షెడ్డుల్లో ఇస్తున్నారు. వీరికి సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు.

సరైన ఆస్పత్రి ఏది?

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన అచ్యుతాపురంలో సరైన ఆస్పత్రి లేదు. ఇక్కడ సుమారు 450కి పైగా కర్మాగారాలు ఉన్నాయి. 30 వేల మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. కానీ ఇక్కడ సరైన అస్పత్రి లేదు. అచ్యుతాపురం, హరిపాలెంలలో పీహెచ్‌సీలు మాత్రమే ఉన్నాయి. వీటిలో సరైన మందులు, సౌకర్యాలు, సిబ్బంది లేరు. సెజ్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి కోసం గత వైసీపీ ప్రభుత్వం రెండెకరాలు స్థలం కేటాయించింది. అయితే ఐదేళ్ల పాలనతో కేవలం ప్రహరీ మాత్రమే నిర్మించింది. కూటమి ప్రభుత్వమైనా కర్మాగారాల్లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించే చర్యలు తీసుకోవడంతో పాటు ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

సందడిగా 'ఉత్తరాంధ్ర జానపద జాతర'

సిరిపురం, ఆగస్టు 22 : మన సంస్కృతి, సాంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రైటర్స్ అకాడమీ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జానపద జాతర 2024 కార్యక్రమాన్ని సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనంలో నుంచి పుట్టినవే జానపదం అన్నారు. ఏపీలో సాంస్కృతిక వైభవం సాధిస్తామన్నారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ జానపద కళాకారులను బతికిస్తున్న రైటర్స్ అకాడమీకి ధన్యవాదాలు తెలిపారు. హాస్య నటుడు, పద్మశ్రీ బ్రహ్మానందం మాట్లాడుతూ ఇక్కడకు వచ్చిన వారంతా టీచర్లేనని, తనకు రమణమూర్తి అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. కార్యక్రమంలో మాజీమంత్రి దాడివీరభద్రరరావు, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో హోం మంత్రి అనిత







'ప్రశాంతి'కి బెంగళూరు క్యాంట్ స్టేషన్‌లో హాల్ట్ తొలగింపు

విశాఖపట్నం, ఆగస్టు 22 : బెంగళూరు కంటోన్మెంట్ స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్-1,2ల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18463/18464) బీఎన్‌సీ స్టేషన్‌లో సెప్టెంబరు 19వ తేదీ నుంచి హాల్ట్‌ను తాత్కాలికంగా తొలగించనున్నట్టు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో భువనేశ్వర్ నుంచి కేసీఆర్ బెంగళూరు వెళ్లే 18463 నంబరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 19వ తేదీ నుంచి డిసెంబరు 19వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కేసీఆర్ బెంగళూరు నుంచి భువనేశ్వర్ వచ్చే 18464 నంబరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 20వ తేదీ నుంచి డిసెంబరు 20వ తేదీ వరకు బెంగళూరు క్యాంట్ స్టేషన్‌లో హాల్ట్ ఉండదన్నారు. ప్రయాణికుల గమనించాలన్నారు.

నేడు రెండున్నర గంటల ఆలస్యంగా బొకారో ఎక్స్‌ప్రెస్

నిర్ణీత సమయానికి జత రేక్ అందుబాటులో లేకపోవడంతో అలెప్పీ-దనబాద్ బొకారో ఎక్స్‌ప్రెస్ (13352) శుక్రవారం (23న) ఒరి జినేటింగ్ నుంచి రెండున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరే విధం గా రీ షెడ్యూల్ చేశామని రైల్వే అధికారులు తెలిపారు. దీంతో శుక్రవారం ఉదయం 6.00 గంటలకు అలెప్పీలో బయలుదేరాల్సిన ఈ రైలు ఉదయం 8.45 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు.

ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ వేగవంతం

... 5వ పేజీ తరువాయి

పోర్టు ముందుకువచ్చింది. దీంతో పోర్టు వాటా రూ.50.96 కోట్లకు చేరింది. ఏడాదిన్నర క్రితం ప్రారంభమైన ఈ పనులు వైసీపీ హయాంలో నత్తనడకన సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు దీనిపై సమీక్షించి హార్బర్ ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్‌కు బాధ్యత అప్పగించారు. దాంతో ఆయన తరచూ సమీక్షలు నిర్వహిస్తూ, పనులు వేగవంతం చేస్తున్నారు.ప్రస్తుత హార్బర్‌లో డిమాండ్‌కు అనుగుణంగా వసతుల కల్పన, ఆధునికీకరణ ప్రధాన ధ్యేయం. వేలం హాళ్లు, ప్యాకింగ్ యూనిట్, పార్కింగ్ ఏరియా, ఆఫీసుకు ప్రత్యేక సదుపాయం, రెస్ట్ రూమ్, క్యాంటీన్, చేపలు ఎండబెట్టుకోవడానికి పరిశుభ్రమైన యార్డులు, చేపలు నిల్వ చేసుకునే సదుపాయం, ఫ్లోటింగ్ జెట్టీలు, వాటికి రిటైనింగ్ గోడలు, మురుగునీటిని శుద్ధిచేసే ప్లాంటు, అంతర్గత రహదారులు, అండర్ గ్రౌండ్ రిజర్వాయర్, ఓవర్ హెడ్ ట్యాంక్, సోలార్ విద్యుద్దీపాలు ఏర్పాటుచేస్తామని డీపీఆర్‌లో పొందుపరిచారు. ఈ పనులన్నింటినీ ఏడు దశలుగా విడదీసి వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. ఆర్‌సీసీ ఫైల్డ్ జెట్టీ నిర్మాణానికి డిజైన్ తయారు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు మురుగునీటి శుద్ధి కేంద్రం అందుబాటులోకి తేనున్నారు.



నిర్మాణంలో ఉన్న భవనం

పోర్టు అదనపు నిధులతో..

పోర్టు అదనంగా సమకూర్చిన రూ.26.7 కోట్లతో రెండు ఫింగర్ జెట్టీలు, నాలుగో నంబరు జెట్టీ నుంచి 11వ నంబరు జెట్టీ వరకు వార్ఫ్ నిర్మాణం, అదనంగా మరో వేలంహాలు నిర్మించనున్నారు. కొత్త వేలం హాలును ఏసీ సదుపాయంతో ఏర్పాటు చేస్తారు. బోట్ల నుంచి దించిన చేపలు, రొయ్యలను వేలం హాళ్లకు కన్వేయరు బెల్టుల ద్వారా పంపే ఏర్పాట్లుంటాయి. దించి, ఎత్తడం వల్ల సముద్ర ఉత్పత్తులు పాడైపోకుండా ఈ సదుపాయం కల్పిస్తున్నారు.



అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, ఆగస్టు 22 : వరాహలక్ష్మీనృసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు పసిడి కుసుమాలతో పూజలు జరిపారు. తరువాత అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, ఆగస్టు 22 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన ఇద్దరు దాతలు రూ. లక్ష చొప్పున విరాళాలు సమర్పించారు. బి. రామ్‌కుమార్, మౌనిక దంపతులు తమ విరాళాన్ని చెక్ రూపంలో దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తికి, మరో దాత కనకరత్నం, శ్రీనివాస్ రూ. లక్షలను చెక్కు రూపంలో ప్రజా సంబంధాల అధికారి సిరిపురపు కనకరాజుకు గురువారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతలకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు .

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, ఆగస్టు 21 : ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఆపరేషన్ విభాగం ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. చినగదిలి, పెదగదిలి, పైనాపిల్ కాలనీ, దీనదయాళపురం, సిద్ధార్థ బీసీ కాలనీ, కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం, శాలిపేట, తోటగరువు, గాంధీనగర్, శ్రీహరి నగర్, రవీంద్రనగర్, ముస్తాఫా కాలనీ, బాలాజీనగర్, పార్వతీనగర్, బీటీఆర్ నగర్, డ్రైవర్స్ కాలనీ, ఎస్ఎస్ఎం టవర్స్, కోకో బాటలింగ్ ప్రాంతం, సుందరనగర్, టీఐసీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

ఆనందపురంలో..

ఆనందపురం :మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు. దుక్కవానిపాలెం, ఈగలవానిపాలెం, పాలవలస, మెట్టమీదిపాలెం, తర్లువాడ, నగరప్పాలెం, గుడిలోవ, పెద్దిపాలెం, పల్లిపేట, పొడుగుపాలెం, చందక, కుసులువాడ, జగన్నాథపురం, వెంకటాపురం గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.

రేపు అనకాపల్లి జోన్‌లో తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, ఆగస్టు 22 : జీవీఎంసీ 7వ జోన్ అనకాపల్లి పరిధిలో శనివారం కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్టు జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీరు శేఖర్ తెలిపారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. జీవీఎంసీ అమృత్ ప్రాజెక్టు 2.0లో భాగంగా పీఎస్‌సీ పైపులైన్ల స్థానంలో 500 ఎంఎం సైజు గల డీఐ పైపులైన్లుకు అనుసంధానం చేయనున్నామన్నారు. ఈమేరకు శనివారం అనకాపల్లి (తుమ్మపాల) హెడ్ వాటర్ వర్క్స్ నుంచి ప్రస్తుతం ఉన్న పీఎస్‌సీ పైప్‌లైన్ల ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

సినిమా గైడ్

- **తంగలాన్ :** శారద, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** కామేశ్వరి, మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), కన్య విశేష్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, సంగం, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం).
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)
- **భారతీయుడు-2 :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 27, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 22, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 24, క్యారెట్ 32, దొండకాయలు 28, బంగాళదుంపలు 34, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 120, బరబటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 40, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 76, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

అధికారికంగా హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసిన పూర్వ విద్యార్థులు

భీమునిపట్నం, ఆగస్టు 22 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడానికి ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యేను కలిసారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ పాఠశాల చరిత్ర, గొప్పతనాన్ని నలుదిశలా తెలిసేలా ఉత్సవాలను ప్రభుత్వపరంగా నిర్వహించేలా కృషి చేస్తానన్నారు. వందేళ్ల పూర్తయిన పాఠశాలలు అరుదుగా ఉంటాయని, వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌ను ముఖ్య అతిథులుగా హాజరయ్యేలా ప్రయత్నిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరాడ రాజబాబు,పూర్వ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు ఎంవీ పార్వతీశం, ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, నాయకులు కంటుభుక్త ముత్యాలరావు, చౌదరి సత్యారావు, పూసర్ల శ్రీనివాసరావు, మైలపల్లి షణ్ముఖరావు, పాఠశాల హెచ్ఎం పొన్నగంటి రమణ, చిలకా రమణ, మీసాల ఉపేంద్ర, బండారు సుధాకర్, లచ్చుబోతు ఆదినారాయణ, రాజేటి బసవ కృష్ణమూర్తి, కాళ్ల సన్నీ పాల్గొన్నారు.

పద్మనాభంలో ఎరువుల దుకాణాలు తనిఖీ



రెడ్డిపల్లిలో ఎరువులను తనిఖీ చేస్తున్న అధికారులు

పద్మనాభం, ఆగస్టు 22 : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఎరువులు, విత్తనాల దుకాణాలను తూనికలు, కొలతల శాఖ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. రేవిడి, పద్మనాభం, మద్ది, రెడ్డిపల్లి గ్రామాల్లోని దుకాణాలను తనిఖీ చేసి ప్రతి బస్తాను తూనిక వేశారు. రెడ్డిపల్లిలో అనుమాలు శెట్టి వెంకట్రావు ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తుండగా మూడు బస్తాల్లో కొలతలో తేడా రావడంతో కేసు నమోదు చేశారు. దీనిపై సంబంధిత కంపెనీకి నోటీసు జారీ చేస్తామని గాజువాక లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ చిన్నమ్మలు, ఇన్‌స్పెక్టర్ ఉమా సుందరి చెప్పారు. ఈమేరకు డీలర్‌కు సంబంధిత వివరాలతో కూడిన నోటీసు అందజేసి కంపెనీకి పంపించాల్సిందిగా ఆదేశించారు. ఈ దుకాణంలో ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు ఎరువులు అమ్ముతున్న విషయం కూడా వారి దృష్టికి రావడంతో దీనిపై కూడా కేసు నమోదు చేసి రశీదు పుస్తకాలు సీజ్ చేశారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచుతున్న అభిమానులు

భీమునిపట్నం, ఆగస్టు 22 : ప్రముఖ సినీ నటుడు చిరంజీవి 69వ జన్మదిన వేడుకలను చిరంజీవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేయడంతో పాటు మెయిన్ రోడ్‌లో మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిరుపేదలకు పులిహోర పొట్లాలు అందించారు. సాయంత్రం చిన్నబజారు జంక్షన్‌లో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు గంటా నూకరాజు, మైలపల్లి లక్ష్మణరావు, యెచ్చర్ల హరి, మొకర నరసింగరావు, సత్తరవు బాబూరావు, ఆకుల శ్రీను, సబ్బిశెట్టి శ్రీను, రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, మారోజు సంజీవ్‌కుమార్, పాసి వినోద్, ఎర్నింటి అచ్చిబాబు, డింగి దుర్గారెడ్డి, కంచర్ల కామేష్, అల్లిపిల్లి సతీష్, వాసుపల్లి వంశీ, మొకర శంకర్, కంటుభుక్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

కొమ్మాది, ఆగస్టు 22 : గాలికుంటు, బ్రుసిల్లోసిస్ వ్యాధులు సోకకుండా పశువులకు టీకాలు వేయించాలని మధురవాడ పశువుల ఆస్పత్రి వైద్యురాలు అనుపమ పాడి రైతులకు సూచించారు. గురువారం ఆమె నగరంపాలెం గ్రామంలో 86 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన పెయ్యిలకు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. బ్రుసిల్లోసిస్ వ్యాధి నివారణకు నాలుగు నెలలు నుంచి ఎనిమిది నెలలు వయస్సున్న పెయ్యిలకు టీకాలు వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో డిడి చంద్రశేఖర్, సహాయ సంచాలకులు శ్రీనివాస్, డాక్టర్ హిమజ, తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

భీమునిపట్నం, ఆగస్టు 22 : కోల్‌కతాలో వైద్య విద్యార్థిని అత్యాచారం, హత్య ఘటనలో నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. గురువారం వారు అంతర్జాతీయ మానవహక్కుల న్యాయసేవా మండలి జాతీయ ఆర్గనైజింగ్ చైర్మన్ ఓరుగంటి సుబ్బారావు పిలుపుతో విజిలెన్స్ కమిటీ జాతీయ కార్యదర్శి భాగం స్వామి సుధాకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. రాజ్‌కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతుండడంతో తక్షణమే నిందితుడ్ని శిక్షించి, మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మహిళా భద్రతకు చట్టాలను పటిష్ఠం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రసాద్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె. వెంకటరమణ, మానవ హక్కుల యాక్టివిస్ట్ చిల్ల ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిషనరీతోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీల శుభ్రం

వెంకోజీపాలెం, ఆగస్టు 22 : జీవీఎంసీ పరిధిలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీల్లో దిగి ఎవరూ పరిశుభ్రత పనులు చేపట్టరాదని, దీన్ని పూర్తిగా నిషేధించామని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీల్లో మనుషులు దిగి మాన్యువల్‌గా పరిశుభ్రం చేసే పనులను నిషేధించామని చెప్పారు. జీవీఎంసీకి చెందిన మిషనరీతోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను శుభ్రం చేస్తామన్నారు. ఎవరైనా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో దిగి పని చేస్తున్నట్టు గమనిస్తే వెంటనే జీవీఎంసీ టోల్ ఫ్రీ నంబర్ 180042500009 కు ఫోన్ చేయాలని కోరారు.

'చిరు వర్తకులకు వ్యాపార రక్షణ కల్పించాలి'

మద్దిలపాలెం, ఆగస్టు 22 : జీవీఎంసీ 22వ వార్డు కళాభారతి రోడ్డులో ఉన్న తోపుడు బండ్ల వ్యాపారులకు వ్యాపార రక్షణ కల్పించాలని చిరు వ్యాపారులు కోరారు. గురువారం వారు మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న జనవానిలో వినతిపత్రం అందించారు. ముందుగా కార్యాలయం ఎదుట కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తమ సమస్యను జనసేన నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు.అలాగే తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి కూడా తమ సమస్యను తీసుకువెళ్లారు. కార్యక్రమంలో కళాభారతి తోపుడు బండ్ల వర్తకులు, నాయకులు పాల్గొన్నారు.

ఆశీలు వసూలుకు బహిరంగ వేలం రేపు

భీమునిపట్నం, ఆగస్టు 22 : జీవీఎంసీ జోన్ వన్‌లో వున్న భీమిలి రోడ్ మార్జిన్, లాల్ బహదూర్‌శాస్త్రి మార్కెట్, కలిగొట్ల సూర్యనారాయణనాయుడు మార్కెట్‌లో ఆశీలు వసూలుకు శనివారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ కె. కనకమహాలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.ఆశీలు వసూలుకు అనుమతి ఇచ్చిన తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ కాలపరిమితి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు జోనల్ కార్యాలయంలో రూ. 3 లక్షలు ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చనని చెప్పారు. అలాగే మూడో వార్డు బీచ్‌రోడ్‌లో వున్న జీప్లస్ వన్ షాపు మూడేళ్ల కాలపరిమితికి కూడా అదే రోజు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి రూ. 2. 57 లక్షల ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు. పెద్దబజారులో మీసేవా మేడపై ఉన్న రూమ్‌కు కూడా మూడేళ్ల లీజు కాల పరిమితికి వేలం నిర్వహించనున్నామన్నారు. దీనికి రూ.1. 84 అక్షల ధరావత్తు సొమ్ము చెల్లించాలని చెప్పారు. ఆయా ఆశీళ్ల వసూలుకు సంబంధించి శనివారం ఉదయం 11 గంటలకు జోన్ వన్ కార్యాలయంలో వేలం ఉంటుందన్నారు.

బీజేపీలో పలువురు చేరిక

ఆనందపురం, ఆగస్టు 22 : మండలంలోని వెల్లంకి గ్రామంలో బీజేపీ విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రామునాయుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. గిడిజాల, శిర్లపాలెం, గొట్టిపల్లి, తర్లువాడ గ్రామాలకు చెందిన సుమారు వంద మంది పార్టీలో చేరారు. వారికి నాయకులు కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్వతీపురం ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, తర్లువాడ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ పిల్లా సూర్యనారాయణ, గొట్టిపల్లి గ్రామానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ రాజు, పసుపులేటి శ్రీనివాసరావు, బండారు అనిల్‌కుమార్, లెంక శ్రీరామ్, తెడ్లాపు అప్పారావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



బాలసదనం సిబ్బందితో మాట్లాడుతున్న శేషమ్మ

భీమునిపట్నం, ఆగస్టు 22 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏవీ శేషమ్మ గురువారం రాత్రి పట్టణంలోని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు క్రమశిక్షణతో చదువుకుని మంచి పౌరులుగా ఎదగాలన్నారు. ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం మెనూపై బాల సదనం సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సిడిపివో ఎం. శ్రీదేవి, బాల సదనం సూపరింటెండెంట్ ప్రమీల పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ పరిశీలన

భీమునిపట్నం, ఆగస్టు 22 : భీమిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ఎక్కడైనా ఇసుక అక్రమ నిల్వలు వున్నా, అమ్మకాలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని సెబ్ ఎస్ఐ పి. చిన్నంనాయుడు తెలిపారు. గురువారం ఆయన కృష్ణాకాలనీలో ఉన్న ప్రభుత్వ ఇసుక డిపో యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక అక్రమ నిల్వలు ఉంటే ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలి

- ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్రం విరమించుకోవాలి
- మహా ధర్నాలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు



ప్లకార్డులు చూపిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 22 : స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు కర్మాగారంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని, ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద మహా ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్లాంటులో పూర్తి స్థాయి ఉత్పత్తి చేయకపోవడం వల్ల కర్మాగారానికి నష్టాలు వస్తున్నాయన్నారు. ఉత్పత్తి పెంచేందుకు ఉద్యోగులు సిద్ధంగాఉన్నప్పటికీ అందుకు తగ్గ ఏర్పాట్లను యాజమాన్యం చేయడం లేదని ఆరోపించారు. ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే విరమించుకోవాలన్నారు. దేశంలో ఇతర స్టీల్ ప్లాంటుల ఉద్యోగులు కొత్త జీతాలు తీసుకుంటుంటే, ఇక్కడ మాత్రం ఉన్న పాత జీతాలకే దిక్కు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్మాగారంలో పని ప్రదేశంలో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉజ్వల భవిష్యత్తు కలిగిన ప్లాంటును నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. పొదుపు చర్యల పేరుతో ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుండడం శోచనీయమని పేర్కొన్నారు. ఇదిలావుండగా పోరాట కమిటీ నాయకుల మహా ధర్నా సందర్భంగా ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ పర్యవేక్షణలో స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు పటిష్ఠ చర్యలు చేపట్టారు. ముందస్తు చర్యల్లో భాగంగా పరిపాలన భవనం ప్రధాన గేటు వద్ద ఇనుప కంచెను ఏర్పాటు చేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ధర్నాలో భాగంగా నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పరిపాలన భవనం ముందు భైఠాయించడంతో పాటు మధ్యాహ్నం భోజనం కూడా అక్కడే చేసి నిరసన తెలిపారు. తమ సమస్యలపై ఉక్కు యాజమాన్యం తక్షణమే స్పందించకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, నమ్మి సింహాద్రి, విళ్లా రామ్మోహన్‌కుమార్, యు.రామస్వామి, వైటీ దాసు, తదితరులు పాల్గొన్నారు.



అడ్మిన్ భవనంలోకి ఎవరూ ప్రవేశించకుండా ఏర్పాటు చేసిన ఇనుప కంచె



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

'వంచన' సినిమా పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 22 : నగరానికి చెందిన కళాకారులు నటించిన వంచన చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని ఎంపీ శ్రీభరత్ కోరారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో వంచన చిత్రం టీజర్, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన నటీనటులతో దర్శకుడు ఉమా మహేష్ తెరకెక్కించిన ఈ సినిమా ద్వారా సమాజానికి మంచి మేసేజ్ ఇచ్చారని అభినందించారు. దర్శకుడు ఉమా మహేష్ మాట్లాడుతూ కోర్టు రూమ్ డ్రామా థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించినట్టు చెప్పారు.

మధ్య తరగతి కుటుంబం కథే 'సీతారాం సిత్రాలు'

పెదవాల్తేరు, ఆగస్టు 22 : సీతారాం సిత్రాలు సినిమా బృందం నగరంలో గురువారం సందడి చేసింది. రైజింగ్ హ్యాండ్స్ ప్రొడక్షన్ నెంబర్-1 బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి శశిధర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు.హీరోగా లక్ష్మణ్, హీరోయిన్‌గా భ్రమరాంబిక, కిశోర్ ధాత్రిక నటిస్తున్నారు. ఈమేరకు రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో హీరో లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ చిత్రంలో అందరూ కొత్త నటీనటులే నటించారని చెప్పారు.

30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సింహాచలం, ఆగస్టు 22 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈనెల 30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా మాదిరిగానే శ్రావణమాసం నాల్గవ శుక్రవారం పురస్కరించుకుని సింహగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేపడు తున్నామన్నారు. వ్రతాల్లో పాల్గొనే భక్తులకు అవసరమయ్యే పూజా సామగ్రి ఉచితంగా సమకూరుస్తామన్నారు. అలాగే కొండదిగువ నుంచి సింహగిరికి, తిరిగి దిగువకు ఉచిత రవాణా సదుపాయంతో పాటు స్వామివారి దర్శనం కల్పించనున్నట్టు ఆయన చెప్పారు.

సింహగిరిపై శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు రేపు

సింహాచలం, ఆగస్టు 22 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 27న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవంలో భాగంగా ఆ రోజు ఉదయం 11.30 నుంచి జరగాల్సిన రాజభోగం మహా నివేదన రాత్రి జరగనున్నందున భక్తులకు ఆ రోజు ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయని చెప్పారు. అలాగే మధ్యాహ్నం 3.15 నుంచి పవళింపు సేవ తరువాత సాయంత్రం 6 వరకు మాత్రమే దర్శనాలు ఉంటాయన్నారు. ఈమేరకు ఆ రోజు రాత్రి ఆరాధన టికెట్ల విక్రయాలు రద్దు చేస్తున్నామని తెలిపారు. 28న ఆలయ ప్రధాన రాజగోపురం వద్ద సాయంత్రం 4.30 గంటలకు ఉట్ల సంబరం నిర్వహించనున్నట్టు చెప్పారు.

సెబీ చీఫ్, అదానీ సంబంధాలపై విచారణ జరపాలి



ధర్నా చేస్తున్న కేంద్ర మాజీ మంత్రులు జేడీ శీలం, కిల్లి కృపారాణి, తదితరులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 22 : సెబీ చీఫ్, అదానీలపై ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం విచారణ జరపాలని కేంద్ర మాజీ మంత్రులు జేడీ శీలం, కిల్లి కృపారాణి డిమాండ్ చేశారు. ఎంవీపీ డబుల్ రోడ్డు కూడలి వద్ద ఉన్న ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు గురువారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తొడదాసి సుధాకర్, నగర అధ్యక్షుడు వజ్రపత్తి శ్రీనివాస్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కవరపు రామారావు, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఎసెన్షియా ఫార్మా కంపెనీపై చర్యలు తీసుకోవాలి'

మద్దిలపాలెం, ఆగస్టు 22 : ఎసెన్షియా ఫార్మా సంస్థపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక ప్రక టన విడుదల చేశారు. 500 కిలోల సామర్థ్యం ఉన్న రియాక్టర్ పేలుడు ధాటికి 17 మంది కార్మికులు మృతి చెందడమే కాకుండా 40 మందికి పైగా గాయాలపాలయ్యారన్నారు. 1997 నుంచి ఇప్పటివరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో 23 ప్రమాదాలు జరిగాయని, గత ఐదేళ్లలో సంభవించిన 19 ప్రమాదాల్లో 49 మంది మృతి చెందారని గుర్తు చేశారు. ఫార్మా సంస్థల్లో కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

పెదవాల్తేరు : ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన నగరం లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కోనోకార్పస్ మొక్కల వల్ల మానవాళికి చాలా ప్రమాదమని చెప్పారు. ఆ మొక్కల నుంచి వీచే గాలి వల్ల ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు వస్తాయని తెలిపారు. ఆయనతో పాటు బుద్ధ లక్ష్మీనారాయణ, దామోదర్ యాదవ్, పొలిమేర శ్రీనివాసరావు, శ్రీరంగం ధనేశ్వరరావు ఉన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

మద్దిలపాలెం, ఆగస్టు 22 : ప్రభుత్వ,ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు యోగాతో ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి చెప్పారు. మద్దిలపాలెం జయభేరి షోరూమ్‌లో గురువారం బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో రక్షా బంధన్ వేడుకలు, రాజయోగ ధ్యానంపై అవగాహన కల్పించారు. ముందుగా బ్రహ్మకుమారీలు ఉద్యోగులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా రామేశ్వరి మాట్లాడుతూ ఉద్యోగులు మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. తమ సంస్థ ద్వారా ధ్యానంలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జయభేరి సంస్థ సీఈవో పి. సన్నిబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.